





ఎండ మాడ్చేస్తోంది.

వాచీ చూసుకొని మరో సారి తిట్టు కున్నాను. ఒకటిన్నరయింది. ఆదివారం కదా టికెట్ దొరకదేమోనని ముందుగా వచ్చాను. ఇంగ్లీష్ పిక్చర్ కావడంతో రెండుంబావు వరకూ బుకింగ్ తీయడు. అప్పటి దాకా. వెయిట్ ఇన్ ది క్యూ బిజినెస్స్! విసుగ్గా ఉంది.

అప్పటికే నాముందో పదిమంది. వెనకాలో పదిహేనుమంది చేర్తారు. మలుపు తిరిగిన క్యూలో సరిగ్గా మలుపు దగ్గర నేనున్నాను. అందర్నీ ఓసారి పరకాయించి చూశాను. చాలా తక్కువమంది చదువు కున్న వారిలా వున్నారు. నాలోని సుపీరియారిటీ కాంప్లెక్సు నమిలేయసాగింది. మిగిలినవాళ్ళకు ఇంగ్లీషేం అర్థమౌతుందని వచ్చారు?

ఎవడువీడు? ఆలోచనల్లోపడి గమనించలేదు క్యూలో నిలబడకుండా నా పక్కన నిలబడ్డాడు అర్థమైంది. క్యూలో నిల్చోటానికి బద్ధకించి ఈ పన్నుగడ పన్నాడన్నమాట! ఇటువంటి కేసులు చాలా చూశాను.

ఎలా దూరతాడో చూస్తాను. ఇటువంటి అన్యాయాన్ని సహించకూడదు. ఇటువంటి చిన్న విషయాల నుంచే అవినీతి ప్రారంభమౌతుంది. నాబోటి చదువుకున్న వాళ్ళు కూడా చూస్తూ ఊరుకుంటే దేశంలో అక్రమం పెరిగిపోదూ? బుకింగ్ తీయనీ అప్పుడు చెప్తాను వీడి పని. అనుకున్నాను.

అవినీతిని నిరోధించి దేశానికో మహోపకారం చేయాలనే గట్టి నిర్ణయం తీసుకున్నతర్వాత మనసు కుదుటబడింది.

ఏదో మూలనుంచి అంతరాత్మ మెల్లిగా గొణగనారంభించింది. చేతిలో సూట్‌కేస్ ఉంది. ఊరుగూరు బాపతేమో? పాపం. టికెట్ దొరక్కపోతే ఇబ్బందిపడతాడేమో? - అని. కాని ఒక్క కసురు కసిరి దాన్నోరు మూయించాను.

ప్చ్.... ఇంకా బుకింగ్ తెరవడేం. అనుకుని మళ్ళీ ఓసారి చుట్టూ చూశాను. అరె! ఆ టీ స్టాల్ దగ్గరుంది విజయ్ అనుకుంటాను. సందేహంలేదు. వాడే! సినిమాకు వచ్చి ఉంటాడు. ఇప్పుడొచ్చి క్యూలో నిల్చుంటే టికెట్ దొరికేలాలేదు. ఇప్పుడెలా?

అంతలో మెరుపులా ఓ ఆలోచనొచ్చింది.

"ఎక్స్క్యూజ్‌మీ. ఇప్పుడే వస్తాను. కాస్త ప్లేస్ చూస్తూండండి" అని వెనుకనున్నవాడితో చెప్పి క్యూలోంచి బయటపడి విజయ్‌ను చేరాను.

"ఏరా! సినిమాకేనా?

"అవున్రా. కాని టికెట్ దొరికేలాలేదు" అన్నాడు కొండవీటి చాంతాడులా పెరిగిన క్యూని చూస్తూ.

"ఏం ఫర్వాలేదు నాతోరా!" అన్జెప్పి వాడిని లాక్కొచ్చి క్యూలో నాముందు నిల్చోబెట్టాను. వెనక వాడేదో చెప్పబోయాడు.

"సారీ అండీ! ఇద్దరం స్నేహితులం. ఇప్పుడు వెళ్ళి వెనకాల నుంచుంటే ఇబ్బందిపడతాం" అని మళ్ళీ మాట్లాడకుండా చేశాను.

"ఇందాకేదో దేశాన్నుద్ధరించబోయావే" అని అంతరాత్మ ఎత్తిపొడవడం ఆరభించింది. మరో సారి దాన్ని కసిరాను.

అప్పుడే బుకింగ్ తెరిచారు. ★

సుబ్బారావుది దుర్గ వాళ్ళ పక్క ఇల్లు.

అతను ఆ వూళ్ళో వుండి చదువుకునేవాడు. దుర్గ వాళ్ళదీ. సుబ్బారావు వాళ్ళదీ ఒకే ఊరే కాకుండా దూరం చుట్టరికం కూడా వుండటంతో దుర్గవాళ్ళు అతన్ని కనిపెట్టి చూస్తూండేవాళ్ళు. సుబ్బారావు కంటె దుర్గ చిన్నపిల్ల. ఆమెని సుబ్బారావు గౌనులు వేసుకునేటప్పట్నుంచీ ఎరుగును. ఇప్పటికీ దుర్గ అతని తిండీ. తిప్పలూ కనుక్కుంటుంది. కబుర్లు చెప్తుంది తను చదివే పుస్తకాల విశేషాలు విమర్శిస్తుంది.

సుబ్బారావునికూడా నాలెడ్జి పెంచుకోమని పోరు పెడ్తుంది అంతా బాగానే వుందిగానీ, అతన్ని చిన్నపిల్లాడికింద లెక్కేస్తుంది. సుబ్బారావుకి మొదట కోపం వచ్చినా ఆమె తనని అలా విసుక్కోవటం తర్వాత హాయిగానే వుంటుంది. అవీ. ఇవీ అన్నీ లెక్కేసుకుని సుబ్బారావు తను కాస్తా దుర్గని ప్రేమించేస్తున్నట్టుగా లెక్కేసుకున్నాడు. అలా ఊరుకున్నా పోయేది.




మూడురోజుల క్రితం ఏం చేశాడు మరి.. ఆ రోజున యాపిల్ కోసుకు తిందామని బుద్ధి పుట్టింది. సరే, ముందు చాకు